క్లుప్తంగా

శ్రీరామునికి లక్ష చామంతులతో అర్చన



నాగాయలంక: మార్గశిర ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కృష్ణాతీరం శ్రీరామ పాదక్షేత్రం ప్రాంగణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష చామంతులతో పుష్పార్చన నిర్వహించారు. 130 కిలోల చామంతి పూలతో గర్భాలయంలోని సీతారాముల మూల విరాట్‌లకు, ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులకు ఏకకాలంలో పుష్పార్చన, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళాలతో పూజ



గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన మాధవ స్వామి దేవస్థానంలో లక్ష తులసీదళ పూజా మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ ఆధ్వర్యంలో లక్ష తులసీదళ పూజ మహోత్సవాలు నిర్వహించారు. ఊంజల్ సేవ, విష్ణు సహస్రనామ పారాయణం, స్వామి వారి క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నం హరిరామకృష్ణ, మురళీకృష్ణ, అప్పయ్య, ప్రసాద్ జగ్గయ్య, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



పెడన: కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా ఆదేశాలతో పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ తన సిబ్బందితో పెడన పట్టణంలోని పెడన–బంటుమిల్లి రోడ్డులో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా భారీ స్థాయిలో నగదు తరలించినా ఇతరత్రా విలువైన వాటితో పాటు మత్తు పదార్థాలు, పానీయాలు, డ్రగ్స్ వంటివి తరలించినా శిక్షార్హులని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ 2 హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధకుల ర్యాలీ



మచిలీపట్నంటౌన్: యోగాసభ ఆధ్వర్యంలో స్థానిక చింతగుంటపాలెంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి యోగా గురువు దమయంతి హాజరై యోగా సాధకులకు మెలకువలు, ఆరోగ్యసూత్రాలను తెలిపారు. యోగాసభ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం యోగా గురువుల ఫొటోలను ట్రాక్టర్‌పై ఉంచి యోగా మందిరం నుంచి జవ్వారుపేట సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. యోగా విశిష్టతను నగర ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగారు.

అనాథ పిల్లలకు అరటి పండ్ల వితరణ

మోపిదేవి: ఏలూరు జిల్లా తోటపల్లి హీల్ ప్యారడైజ్ పాఠశాలకు మోపిదేవికి చెందిన గుత్తికొండ పూర్ణచంద్రరావు, స్వరూపరాణి దంపతులు రూ. 10 వేల విలువగల అరటిపండ్ల గెలలను ఆదివారం వితరణగా అందజేశారు. ప్యారడైజ్ పాఠశాలలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు చదువుకుంటున్నారు. అనాథ పిల్లలకు తనవంతు సాయంగా అరటి పండ్లు అందజేశామని దాత తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠంనేని కుటుంబరావు, నూతక్కి శివబాబు పాల్గొన్నారు.

వైద్య సేవలు చేరువయ్యేలా..

- మండలంలో రేపటి నుంచి రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- ఆరు నెలల పాటు ప్రత్యేక శిబిరాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



పెడన పట్టణంలో జరిగిన మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

పెడన: పేదలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు రెండో విడత పెడన మండలంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో పెడన మండలం తప్ప మిగిలిన అన్ని మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలకు వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు హాజరై వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారు. అసవరమైన వారిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేయనున్నారు. మొదటి విడతలో పెడన నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా 28,464 మందికి పరీక్షలు నిర్వహించారు. ఐదు వేల మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. పెడన నియోజకవర్గంలో ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా నాలుగు మండలాల్లో ఒక్కో మండలానికి 16 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

మొదటి విడతలో మండలాల వారీగా ...

పెడన మండలంలో పెడన, చేవేంద్ర, అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో 8,055 మంది రోగులు ఓపీలో నమోదు అయి పరీక్షలు చేయించుకున్నారు. 136 మందిని వివిధ శస్త్రచికిత్సల నిమిత్తం సిఫార్సులు చేశారు. కృత్తివెన్ను మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 5,891 మంది ఓపీలో నమోదయ్యారు. 69 మందికి వివిధ శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ ద్వారా రిఫర్ చేశారు. గూడూరు మండలంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మరో సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించిన జగనన్న వైద్య శిబిరాల్లో 7,109 మంది ఓపీ నమోదు చేయించుకుని వివిధ పరీక్షలు చేయించుకున్నారు. బంటుమిల్లి మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాల్లో 7,769 మంది ఓపీ నమోదు చేయించుకుని పరీక్షలు చేయించుకున్నారు.

రెండో విడత శిబిరాలు ఇలా..

పెడన మండలంలో ఈ నెల 9వ తేదీన పుల్లపాడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 19న జింజేరు, 27న పెనుమల్లి, ఫిబ్రవరి 6న చోడవరం, 13 నందమూరు, 20న చెన్నూరు, 27న నడుపూరు, మార్చి 5న గురువిందగుంట, 12న బల్లిపర్రు, 19న కమలాపురం, 30న కొంకేపూడి, ఏప్రిల్ 6న కొప్పల్లి, 12న కాకర్లమూడి, 19న ఉరివి, 26న మడక, మే 3న నందిగామ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

పర్యవేక్షణకు రెండు బృందాలు



జగనన్న ఆరోగ్య సురక్ష –2 ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు తనతో పాటు మరో ఇద్దరు కూడా రెండు బృందాలుగా పర్యవేక్షిస్తారు. ఈఓపీఆర్డీతో పాటు ఎంపీహెచ్‌ఈఓ కూడా ఆయా శిబిరాల ఏర్పాటు, నిర్వహణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ప్రత్యేక వైద్య నిపుణులు కూడా రానున్నారు. పెడన, చేవేంద్ర పీహెచ్‌సీల పరిధిలో ఈ శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించడమే కాకుండా శస్త్రచికిత్సలకు సిఫార్సు చేస్తారు. మంచం మీద ఉండి మందులు తెచ్చుకునే పరిస్థితి లేనివారుంటే వారికి పోస్టు ద్వారా ఉచితంగా మందులను అందజేస్తాం.

–వి. రెడ్డయ్య, ఎంపీడీఓ, పెడన

సమస్యల పరిష్కారానికి కృషి

నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కొన్ని అర్జీలను పరిశీలించిన కిట్టు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తున్నామని కిట్టు చెప్పారు. సమస్యలన్నింటిని స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పెన్షనర్ల దాతృత్వం



మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన మెట్ల అన్నపూర్ణమ్మ ఇటీవల మృతిచెందింది. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 33,350 నగదును మృతురాలు అన్నపూర్ణమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసరావు, పింఛనుదారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



వాసవీక్లబ్ ముగ్గుల పోటీల్లో ప్రథమస్థానం సాధించిన ముగ్గును పరిశీలిస్తున్న పేర్ని కిట్టు, వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: సంక్రాంతి సందర్భంగా నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సన్‌స్టార్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు 140 మంది విద్యార్థులు హాజరై ముగ్గులు వేశారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మేఘన–జాగృతి, పద్మపూజిత–దివ్య, హనుశ్రీ–భార్గవిలకు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 1000 చొప్పున నగదు బహుమతులను పేర్ని కిట్టు, మేయర్ అందజేశారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

- స్థానిక గొడుగుపేట శంకరమఠంలో వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్, కపుల్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన స్వప్న, స్వాతి, నవ్యలతో పాటు కన్సొలేషన్ బహుమతులను పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ అందజేశారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు వేముల కృష్ణ, శ్రీకాకోళపు నరసింహగుప్తా, యెండూరి సురేష్, వాసవీ క్లబ్ అధ్యక్షులు వేముల కృష్ణ నరసింహమూర్తి, కార్యదర్శి జల్లూరి రాంబాబు, కోశాధికారి జయవరపు ప్రసాద్, వాసవీ వనితక్లబ్ అధ్యక్షురాలు తమ్మన అనూరాధ, ప్రధాన కార్యదర్శి కొల్లూరి నాగలక్ష్మీశ్రీదేవి, కోశాధికారి తమ్మన నాగమల్లిక హాజరయ్యారు.



సన్‌స్టార్ స్కూల్‌లో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్నపేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

అవాస్తవ ప్రచారం మానుకోవాలి

కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ



ఉర్దూ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లను చూపుతున్న కార్పొరేటర్ అస్గర్‌అలీ

మచిలీపట్నంటౌన్: టీడీపీ నగర నాయకులు ప్రజలను మభ్యపెట్టేందుకు అవాస్తవాలు చెప్పడం మానుకోవాలని 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ అన్నారు. 27వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ రాళ్ల కొట్టు రాము శనివారం 33వ డివిజనలోని ఉర్దూ పాఠశాలలో నాడు–నేడు పథకంలో భాగంగా విద్యార్థులకు నిర్మించిన మరుగుదొడ్లు అప్పుడే ధ్వంసమయ్యాయని, నాణ్యతా లోపంతో నిర్మించారని ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని అస్గర్ అలీ ఖండించారు. పాఠశాలకు ఆదివారం అస్గర్ అలీతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు మీడియాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నాడు – నేడు పథకంలో భాగంగా నాణ్యతతో నిర్మించిన మరుగుదొడ్లను మీడియాకు చూపారు. టీడీపీ కార్పొరేటర్ రాళ్ల కొట్టు రాము టీడీపీ హయాంలో 2018లో నిర్మించిన రైతుబజార్ మరుగుదొడ్లను చూపించి నాడు – నేడు పథకం ద్వారా పాఠశాల విద్యార్థులకు నిర్మించిన మరుగుదొడ్లలా దుష్ప్రచారం చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అవగాహన లోపం, అత్యుత్సాహంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు టీడీపీ హయాంలో నిర్మించిన నాణ్యత లేని మరుగుదొడ్లను చూపటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాడు రూ. 50 లక్షల వ్యయంతో రైతుబజార్‌లో నాణ్యత లేని షెడ్లు, మరుగుదొడ్లు నిర్మించి టీడీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్ మొహిసిన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ రబ్బానీ, యూనస్, డివిజన్ పరిధిలోని మహిళలు, వైఎస్సార్ సీపీ 34వ డివిజన్ కన్వీనర్ సుంకర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రూ.9.35 లక్షల విలువగల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో చల్లపల్లికి చెందిన ఇద్దరికి రూ.2.65 లక్షలు, అవనిగడ్డలో ఒకరికి రూ.5.50 లక్షలు, ఘంటసాలలో ఒకరికి రూ.1.20 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, ఘంటసాల మండల కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, వేమూరి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో క్రీడాకారుడి ప్రతిభ



నాగాయలంక: విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో ఈ నెల 6,7 తేదీల్లో 70 ఏళ్లు పైబడిన వృద్ధ క్రీడాకారులకు నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి మాస్టర్ చాంపియన్‌షిప్ పోటీల్లో నాగాయలంక మండలంలోని కొత్తపాలెం మరియపురం గ్రామానికి చెందిన తూము జగదీష్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించాడు. 200 మీటర్ల ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, 800 మీటర్ల విభాగంలో ద్వితీయ బహుమతిని గెలుపొంది ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగనున్న నేషనల్ లెవల్ పోటీలకు ఎంపికయ్యారు. జగదీష్‌ను నాగాయలంకకు చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు అభినందించారు.

అపూర్వ కలయిక



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1988–91 విద్యా సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు కలుసుకుని నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఫోన్ నంబర్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ ఐడీలు తీసుకుని కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. కొంతమంది సెల్ఫీలు తీసుకున్నారు. అందరూ కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు.

కరిముల్లా ఖాన్‌కు సన్మానం



కరిముల్లా ఖాన్‌ను సత్కరిస్తున్న రంగారావు, నజీర్ బాషా

చల్లపల్లి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్ కరిముల్లా ఖాన్ అన్నారు. ఇటీవల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పఠాన్ కరిముల్లా ఖాన్‌ను ఆదివారం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కరిముల్లా ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలను సమీకరించి పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని), అవనిగడ్డ మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, జిల్లా బీసీ నాయకులు చెన్ను రంగారావు, నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీ ఎండీ మహబూబ్ పాషా ఘనంగా సత్కరించారు. పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత



ట్రై సైకిళ్లు, వీల్‌చైర్ అందిస్తున్న రాజేంద్రబాబు, సురేష్

పురిటిగడ్డ(చల్లపల్లి): దశాబ్దాలుగా పేదల అవసరాలు తీర్చుతూ సమాజ సేవలో తరిస్తున్న ఐవీఎం సురేష్ ఆదర్శనీయులని విశ్రాంత డీఎస్పీ కె.హరి రాజేంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములవల్లి సురేష్ ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. చల్లపల్లి మండలం పాగోలుకు చెందిన ఉడుముల సత్యవతి, ఘంటసాల మండలం దేవరకోటకు చెందిన ఇటుకల వెంకటేశ్వరరావు, గుడివాడ మండలం వానపాములకు చెందిన సందీప్‌లకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎం ట్రస్ట్ సభ్యులు ఎస్.ఫణి, పి.రాజేష్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

- **కోనేరుసెంటర్:** బందరు మండలం శిరివెళ్లపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు వీల్‌చైర్‌ను అందజేశారు. గ్రామానికి చెందిన పేరుబోయిన నాగస్వాములు కుమార్తె హర్షిణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా గ్రామానికి చెందిన పార్టీ నాయకులు ఆమె పరిస్థితిని కిట్టు దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న కిట్టు బాధితురాలికి వీల్‌చైర్‌ను అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

చల్లపల్లి: స్థానిక నారాయణరావు నగర్‌లోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నానీ), ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) ఆలయంలో అక్షింతలకు పూజలు చేసి పంపిణీని ప్రారంభించారు. అనంతరం కమిటీ పర్యవేక్షణలో ఇంటింటి పంపిణీ చేశారు.

రగ్గుల అందజేత

పురిటిగడ్డ(చల్లపల్లి): చలికాలం నేపథ్యంలో నిరుపేద వృద్ధులు, వితంతువులకు అవనిగడ్డ శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు రగ్గులు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక సైఫన్ సీఎస్‌ఐ చర్చిలో 65 మందికి రగ్గులు అందచేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ ప్రవీణ్, విశ్వాసులు పాల్గొన్నారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

కోనేరుసెంటర్: బందరు మండలం కరగ్రహారం పంచాయతీ పరిధి క్యాంప్‌బెల్‌పేట, కరగ్రహారం గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ చాణక్య సిబ్బందితో సోదాలు నిర్వహించారు. ఇద్దరు మహిళలు మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

89 మందికి ఉపకార వేతనాలు

మచిలీపట్నంటౌన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. నగరంలోని బుట్టాయిపేట అన్నం వీరరాఘవమ్మ, రాఘవరావు కల్యాణ మండపంలో నగర ఇస్కాన్ ప్రతినిధి నందగోపాల్‌దాస్ 89 మంది విద్యార్థులకు రూ. 1.20 లక్షల ఉపకార వేతనాలను అందించారు. అవోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

కళారంగానికి రంగారావు సేవలు ఎనలేనివి



సొర్లగొంది(నాగాయలంక): దివిసీమలో రంగస్థల కళాకారుడిగా బహుళ ప్రాచుర్యం పొందిన సొర్లగొంది గ్రామస్తుడు కొక్కిలిగడ్డ పాండురంగారావు కళారంగానికి ఎనలేని సేవలు చేశారని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బర్రి ప్రసాద్ అన్నారు. పాండురంగారావు సంస్మరణ సభ ఆదివారం గ్రామంలో జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ పాండురంగారావు రంగస్థల దర్శకుడిగా, నటుడిగా ఎంతో మంది ఔత్సాహికులకు పౌరాణిక, సాంఘిక నాటకాలు నేర్పించి ఆదర్శప్రాయుడిగా నిలిచాడని చెప్పారు. నాటక రంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. సంఘం ప్రతినిధి లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు తుంగల కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ శివానందరావు, తిరుమలశెట్టి మస్తాన్‌రావు, పలువురు రంగస్థల నటులు, అభిమానులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయం కిటకిట

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. నాగపుట్ట, నాగ మల్లివృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఏడుగురు జూదరుల అరెస్ట్

ఉత్తరపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం శివారు ఉత్తరపాలెంలో శనివారం రాత్రి బహిరంగ ప్రదేశంలో జూదం (పేకాట) ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పేకాట ఆడుతున్న వ్యక్తుల నుంచి రూ. 4,440 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పేకాట ఆడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫిబ్రవరి 4న నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని చెప్పారు. పాల్గొనే వారు సెల్: 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.